క్లుప్తంగా

మరిడమ్మ ఆలయంలో చండీహోమం



మరిడమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా వెండి, బంగారు పుష్పాలతో చండీహోమం, పూజా, అర్చన కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్య లోభక్తులు పాల్గొన్నారు.

జేసీబీ సీజ్



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన జేసీబీ

కొత్తపల్లి: అమరవల్లి రావాడ శ్రీనివాస్‌రెడ్డి పొలంలో ఎటువంటి అనుమతులు లేకుండా జేసీబీతో బొండు ఇసుకను తవ్వుతుండగా ఆదివారం అధికారులు పట్టుకున్నారు. గ్రామంలో అక్రమంగా బొండు ఇసుకను తరలిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ, పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో జేసీబీని గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.రాజు సీజ్ చేశారు.

సౌరశక్తిపై ఆసక్తి

- సోలార్‌కు పెరుగుతున్న డిమాండ్
- సబ్సిడీతో ప్రోత్సహిస్తున్న కేంద్రం
- మండల ప్రజా పరిషత్‌లో ఏర్పాటు



వేట్లపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లు

సామర్లకోట: విద్యుత్ వినియోగం ఎక్కువైంది. అన్ని విద్యుత్‌తో పనిచేస్తుండడంతో దానికి డిమాండ్ పెరిగింది. దీంతో ప్రతి ఒక్కరూ సోలార్ వ్యవస్థపై ఆసక్తి చూపుతున్నారు. బొగ్గు కొరత ఏర్పడంతో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఉన్న కారణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. సోలార్ విద్యుత్ కారణంగా పర్యావరణ పరిరక్షణకు అవకాశం ఉంటుందని అధికారులు చెపుతున్నారు. దీనిలో భాగంగా సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకొనే విధంగా వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన లబ్ధిదారులు సోలార్‌కు రావలసిన పెట్టుబడి పెట్టుకొనే అవకాశం లేదని కారణంగా 200 యూనిట్ల లోపు విద్యుత్తును ఉపయోగించుకొనే వారికి ఉచితంగా సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే సర్వే పూర్తి చేశారు. భవనాలు ఉన్న వారి శ్లాబ్ పైభాగంలోను, పాకలు, పెంకిళ్లు ఉన్న వారి ఖాళీ స్థలంలోను సోలార్ ఏర్పాట్లకు రంగం సిద్ధం చేశారు. సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం లేని వారి కోసం ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆ ప్రదేశంలో సోలార్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేసి దాని ద్వారా విద్యుత్ అందజేయడానికి జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసుకొని వారి అవసరాలకు మించి ఉన్న విద్యుత్‌ను ఏపీఈపీడీసీఎల్ సంస్థ తీసుకొని యూనిట్‌కు చెల్లిస్తోంది.

త్రీ కేవీ వరకు సబ్సిడీపై సోలార్

ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారికి ఏపీఈడీసీఎల్ ద్వారా సోలార్ సబ్సిడీపై అందజేస్తున్నారు. ఈ మేరకు వన్ కిలోవాట్స్‌కి రూ.30వేలు, 2 కేవీకి రూ.60వేలు, త్రీ కేవీకి రూ.78 వేల వరకు సబ్సిడీపై సోలార్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్‌ను ఏర్పాటు చేశారు. సుమారు 15 ఏళ్ల క్రితం అప్పటి ఎంపీడీఓగా ఉన్న అడపా వెంకటలక్ష్మీ(ప్రస్తుత డ్వామా పీడీ) సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసి అప్పట్లో జిల్లాకు ఆదర్శంగా నిలిచారు. అదే విధంగా వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. నెడ్‌క్యాప్, గెయిల్ సంస్థలు సంయుక్తంగా సోలార్‌ను ఏర్పాటు చేయగా దీనిని నుంచి నెలకు 600 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఆస్పత్రికి కేవలం 400 యూనిట్లు మాత్రమే అవసరం కాగా మిగిలిన 200 యూనిట్లు ట్రాన్స్‌కోకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందుతున్నారు.

రుణాలు అందజేస్తే..



సోలార్ రూఫ్ టాఫ్ ఏర్పాటుకు సంబంధించి ఏపీఈపీడీసీఎల్ అధికారులే బ్యాంకు రుణం అందించే ఏర్పాటు చేయాలి. ఆ విధంగా చేస్తే వినియోగదారులు ఎక్కువ మంది ముందుకు వస్తారు. విద్యుత్ బిల్లులు చెల్లించే మొత్తంతోపాటు, ట్రాన్స్కో, లబ్ధిదారుని నుంచి తీసుకుంటున్న విద్యుత్ బిల్లు బ్యాంకు రుణం ఖాతాకు జమ అయ్యేలా చేయాలి. దీనిలో పాటు సోలార్ రూఫ్ టాఫ్‌కు గ్యారంటీతో పాటు సర్వీసు అందుబాటులో ఉండాలి.

– ఆవాల లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు, సామర్లకోట

సబ్సిడీ ఇస్తున్నాం



సోలార్ ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారుడు వినియోగించుకోగా మిగిలిన అదనపు యూనిట్లను ట్రాన్స్కో కొనుగోలు చేస్తోంది. యూనిట్‌కు రూ.1.20పైసలు చొప్పున లబ్ధిదారుడికి చెల్లించాలి. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల సర్వే పూర్తి చేశారు. వారి అంగీకారంతో సోలార్ ఉచితంగా ఏర్పాటు చేస్తాం. దీనికి సంబంధించి టెండర్లు పిలిచాం. ఇతరులకు 1 కేవీకి రూ.70వేలు ఖర్చు అవుతూ ఉండగా రూ.30 సబ్సిడీ గాను, 2 కేవీకి రూ.1.40లక్షలు ఖర్చు కాగా రూ.60వేలు సబ్సిడీగాను, 3 కేవీకి రూ.2 లక్షలు ఖర్చు అవుతూ ఉండగా రూ.78 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. నియోజవర్గ పరిధిలో 600 వరకు దరఖాస్తులు వచ్చాయి.

– కిరణ్, ట్రాన్స్కో ఏడీఈ, సామర్లకోట

అంధకారంలో వీర్రాఘవపురం



విద్యుత్ స్తంభం చుట్టూ పెరిగిపోయిన ముళ్ల తుప్పలు

సామర్లకోట: స్థానిక వీర్రాఘవపురంలో వీధిలైట్లు గత నాలుగు రోజులుగా వెలగకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీర్రాఘవపురం ఎయిర్టెల్ టవర్ ఎదురుగా ఉన్న వీధి అంధకారంలో ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. దీనిపై మున్సిపల్ విద్యుత్ లైన్‌మాన్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. విద్యుత్ స్తంభం చుట్టూ ముళ్ల తుప్పలు పెరిగిపోవడంతో స్తంభం ఎక్కలేని పరిస్థితి ఉంది. ఈ తుప్పలు పొదలు వల్ల ఇళ్లలోనికి పాములు వస్తున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ సిబ్బంది తుప్పలను తొలగించి లైట్లు వెలిగే విధంగా చూడాలని ఆ ప్రాంత ప్రజలకు కోరుతున్నారు.

అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ

- పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంగా గీత తదితరులు

పిఠాపురం: రైతే రాజు అన్న నిజాన్ని చాటి చెప్పి, ఆది నుంచి రైతుకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ రైతు శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తోందని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందని పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై ఈ నెల 9వ తేదీన చేపట్టే అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించి ఆదివారం పిఠాపురం నియోజకవర్గం పార్టీ కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన జరగబోయే అన్నదాత పోరు కార్యక్రమనికి పిఠాపురం నియోజకవర్గ రైతులు, నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలందరూ తరలిరావాలని కోరారు. రైతులకు అండగా పార్టీ చేసే అన్నదాత పోరు కార్యక్రమన్ని విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వానికి రైతుల బాధలు పట్టడం లేదని, యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ అసమర్థత, అనాలోచిత నిర్ణయాల వల్లే రైతులు కష్టాలు తప్పడం లేదన్నారు. రైతుకు కావాల్సింది ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అన్నదాత తమకు యూరియా కావాలని అడుగుతుంటే రాజకీయం చేస్తున్నారంటూ ఒక ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు అనడం దారుణమన్నారు. రైతు తన భూమికి అవసరమైన ఎరువు మాత్రమే అడుగుతాడు తప్ప ఎక్కువ కావాలని ఎవరు అడగరన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని, కేవలం పంటకు ఎరువు వేసుకునే అవకాశం కూడా లేకుండా చేసిందన్నారు. యూరియా కోసం ప్రస్తుతం రైతులు పడుతున్న యాతన అంతా ఇంతా కాదని, ఇలాంటి పరిస్థితి గతంలో రైతు ఎప్పుడు చూడలేదని, రైతును ఆదేకోవాల్సిన ప్రభుత్వం అధోగతి పాలు చేస్తోందన్నారు. అందుకే రైతుకు అండగా వైఎస్సార్ సీపీ నిలబడుతోందని, యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులపై ఆందోళనకు సిద్ధమవుతోందని తెలిపారు. అన్నదాతకు బాసటగా వైఎస్సార్ సీపీ పోరు బాట పట్టిందన్నారు. రైతుకు న్యాయం జరిగే వరకు తాము ఈ పోరాటం ఆపబోయేది లేదన్నారు. గతంలో తాము రైతు తరుపున మాట్లాడితే తప్ప ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు ఇలా ఇబ్బంది పడుతున్న రైతుకు తామంతా అండగా ఉండి వారి కష్టాలు తీరే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కొప్పన శివనాథ్, వర్థినీడి సుజాత, జ్యోతు భీముడు, గండేపల్లి బాబీ, జెడ్పీటీసీ ఉలవకాయల నాగ లోవరాజు, పిఠాపురం నియోజకవర్గ రైతులు నాయకులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం

- ఎరువుల కొరతతో అల్లాడిపోతున్న రైతులు
- రేపు ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా



సామర్లకోట వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించిన దొరబాబు తదితరులు

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ధ్వజమెత్తారు. అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ సందర్భంగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు యూరియా కావలసి ఉండగా దానిని అందజేయడంలో ప్రభుత్వం విఫలమయిదన్నారు. వైఎస్సార్ ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగలేదని ఆయన గుర్తు చేశారు. గత రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం విక్రయించుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. తమ ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉండేలా ప్రతీ గ్రామంలోను రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిని నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి వస్తున్న యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలి పోవడంతో రైతుల ఆవేదన మేరకు వారికి అండగా నిలువాలని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయం నుంచి పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా తరలి వెళ్లి ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు డివిజన్ పరిధిలోని తుని, ప్రత్తిపాడు, కిర్లంపూడి, జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాలకు చెందిన రైతులతో ధర్నా నిర్వహించి ఆర్డీఓకు వినతి పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ సెంటర్‌లోని అంబేడ్కర్ భవనం వద్దకు తరలి రావాలన్నారు. ఈ సందర్భంగా అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. యూరియాతో సహా అన్ని రకాల ఎరువులు రైతులకు వెంటనే అందజేయాలని, బ్లాక్ మార్కెట్ నియంత్రించాలని, ఎరువులను పక్క దొవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఉచిత పంటల బీమా పునరుద్ధరించాలని, వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ గొకిన సునేత్రాదేవి, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు పార్టీ జిల్లా పరిషత్తు విభాగపు అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అల్లిలి వెంకట సీతారామస్వామి, పెద్దాపురం వైస్ ఎంపీపీ మిరియాల రాజు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ వారా సుధాకర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సేపెని రూప, పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బంగారు కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు వీరబాబు, జిల్లా అధికార ప్రతినిధి వినుకొండ విష్ణుచక్రం, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తాటికొండ అచ్చిరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సేపెని సురేష్, మాజీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, పట్టణ మహిళా అధ్యక్షురాలు పాలిక కుసుమ, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, గోపు మురళీ, పుట్టా సూరిబాబు, ఇరుసుమళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంపీడీఓలకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు రెండో బ్యాచ్ శిక్షణ సోమవారం ప్రారంభం అవుతుందని ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీ ఎ.రవిశంకర్ తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతిపురం మన్యం, అల్లూరి సీతా రామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లా లో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు సోమవారం నుంచి అక్టోబరు ఏడో తేదీ వరకు నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థపై గ్రామ స్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయిలో ఎంపీడీఓల విధులు, బాధ్యతలపై శిక్షణ ఇస్తున్నారు. మొదటి బ్యాచ్‌లో 40 మంది ఎంపీడీఓలకు శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఈటీసీ ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు ప్రారంభిస్తారని, శిక్షణా కేంద్రం ఫ్యాకల్టీలతో పాటు, గెస్టు ఫ్యాకల్టీలతో శిక్షణ ఉంటుందన్నారు. ఒక రోజు ఫీల్డు విజిట్ ఉంటుందని తెలిపారు.

మత్స్యకారుడి వలకు చిక్కిన భారీ చేప

కొత్తపల్లి: ఉప్పాడకు చెందిన ఒక మత్స్యకారులు ఆదివారం తెల్లవారు జామున అమీనాబాదు ఉప్పుటేరు నుంచి సముద్రంపై వేటకు వెళ్లాడు. వారికి సముద్రంలో భారీ చేప వలకు చిక్కింది. సుమారు 15 కేజీల బరువు గల ఈ చేపను ఒక వ్యాపారుడు రూ.4 వేలకు కొనుగోలు చేశాడు.



శీలావతి చేపను పట్టుకున్న మత్స్యకారుడు

ఘనంగా వినాయకుని నిమజ్జనాలు

- ఊరేగింపుగా తరలివచ్చిన వియకుడి విగ్రహాలు
- కళకళలాడిన సాగరతీరం



ఊరేగింపుగా సామర్లకోట గోదావరి కాలువ వద్దకు తీసుకొచ్చిన గణేశ్ విగ్రహం

కొత్తపల్లి: గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా ఉప్పాడ సాగరతీరం గణనాథుని నిమజ్జనాలతో ఆదివారం కళకళలాడింది. విగ్రహాలను సాగరంలో నిమజ్జనం చేశారు. భక్తులు పుణ్య స్నానాలను ఆచరించారు. మండలంలో పలు గ్రామాల్లో ఉన్న వినాయక విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పులతో గ్రామాల్లో ఊరేగించారు. ఉప్పాడ సముద్ర తీరప్రాంతంలో మండలం నుంచే కాకుండా పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి విగ్రహాలను లారీలు, ట్రాక్టర్లు, ఆటోలపై వినాయకుని ప్రతిరూపాలను ఊరేగింపుగా భజనలు, నత్యాలు, బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా తీసుకొచ్చి భక్తులు సాగరతీరంలో నిమజ్జనం చేశారు. తీరంలో గణనాథునికి ప్రత్యేక హారతులను ఇచ్చి పూజలను నిర్వహించారు. అనంతరం స్నానాలను ఆచరించారు. భక్తులకు స్వామివారి ప్రసాదాలను స్వీకరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో భారీ బంధోబస్తు నిర్వహించారు. పర్యాటకుల తాకిడితో బీచ్‌రోడ్డు కిక్కిరిసిపోయింది. పర్యాటకులకులతో కళకళలాడింది.

సామర్లకోట

సామర్లకోట: గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా గణేశ్ విగ్రహాల నిమజ్జనాలు ఆదివారంతో ముగిశాయి. పెద్దాపురం, సామర్లకోట పట్టణ, మండల ప్రాంతాల నుంచి ఆదివారం సామర్లకోట గోదావరి కాలువలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. గత నెల 27న ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలలో నిమజ్జనాలు తొమ్మిదో రోజు నుంచి 21వ రోజు వరకూ చేస్తారు. అయితే ఆదివారం రాత్రి చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని ముందుగా విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని పండితులు సూచించడంతో శనివారం సామర్లకోట గోదావరి కాలువలో సుమారు 130 విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆదివారం సుమారు 10 విగ్రహాల వరకు నిమజ్జనం జరిగాయి. నిమజ్జనాల సమయంలో అధికారులు ఎవరూ లేకపోవడం భక్తులు తీసుకువచ్చిన విగ్రహాలను గోదావరి కాలువపై ఉన్న కొత్త వంతెన మీదుగా గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు. దాంతో ఆదివారం సాయంత్రం ఆరు గంటలతో నిమజ్జనాలు ముగిశాయి.

బళ్లమార్కెట్‌లో అన్నదానం

స్థానిక బళ్లమార్కెట్ సెంటర్‌లోని గణపతి ఆలయం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు బలుసు వాసు, సేపెని సురేష్, నిమ్మకాయల రంగనాగ్, ఆస్పత్రి అభివృద్ధి మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మాజీ కౌన్సిలర్ బడుగు శ్రీకాంత్, పడాల పుత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డూల వేలం

కొత్తపల్లి: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన గణపతి ఆలయాలు, మందిరాల వద్ద ఉంచిన లడ్డూలకు ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో శనివారం రాత్రి వేలంపాట నిర్వహించారు. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన లక్ష్మీగణపతి మందిరం వద్ద లడ్డూను కొత్తపల్లికి చెందిన దుబాకుల బాబూరావు రూ.30 వేలకు దక్కించుకున్నారు.



గణపతి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



సామర్లకోట గోదావరి కాలువ వంతెన నుంచి గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న నిర్వాహకులు



పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో గణపతిని ఊరేగింపు




వేలంలో లడ్డూను దక్కించుకున్న బాబూరావు

ఎంపవరింగ్ వాయిస్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు ప్రదానం



అవార్డు పొందిన మూర్తి



అవార్డు పొందిన పద్మజ

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న యాళ్ల పద్మజ, మూలపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నల్లం అచ్యుత రామచంద్ర మూర్తి దంపతులు అంతర్జాతీయ ఎంపవరింగ్ వాయిస్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డును సొంత చేసుకున్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఆన్‌లైన్‌లో వారు ఈ అవార్డు సత్కారాన్ని అందుకున్నట్టు ఆదివారం తెలిపారు. అంతర్జాతీయ ఏ వాక్ త్రు ఎడ్యుకేషన్ సీఈవో డాక్టర్ గ్లోరియా, డేవిడ్ గ్రీన్‌ఫీల్డ్ యు ఎస్సే, డాక్టర్ రానియాలంపు గ్రీస్ వారి సేవా సంస్థ అంతర్జాతీయంగా వివిధ దేశాల ప్రతినిధులతో విద్యా సంబంధ విషయాలపై చర్చ గోష్టి నిర్వహించినట్టు తెలిపారు. కోవిడ్‌కి ముందు కోవిడ్ తర్వాత విద్యా వ్యవస్థలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, దాని వలన విద్యార్థుల్లో ఏర్పడిన ప్రవర్తనాతీరు, మార్పులు తదనుగుణంగా ఉపాధ్యాయులు చేపట్టాల్సిన నూతన అంశములపై చర్చించారు. ఈ చర్చ గోష్టిలో ఇండియా తరపున నుంచి పద్మజ, అచ్యుత రామచంద్ర మూర్తి పాల్గొన్నారు. రాబోవు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా విద్యా సదస్సులు నిర్వహించి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి వీరు మంచి సూచనలు, సలహాలు అందించాలని ఆ కమిటీ వారు సూచించినట్టు తెలిపారు. ఈ అవార్డును అందుకున్నందుకు రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, పెద్దలు వీరిని అభినందించారు.

విద్యుత్ స్తంభాన్ని సరి చేసిన అధికారులు

సాక్షి ఇంపాక్ట్

కొత్తపల్లి: ఉప్పాడ శివారు సుబ్బంపేటలో గత కొన్ని రోజులు విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. దీనిపై 'సాక్షి' దినపత్రిలో శనివారం ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు ఒక వైపు ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని సరిచేశారు. దీపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



సుబ్బంపేటలో విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది